

స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

శ్రీగిరిపై వైభవంగా

లక్ష దీపోత్సవం

- పుష్కరిణికి దశవిధ హారతులు ఇచ్చిన అర్చకులు
- భక్తులతో కిటకిటలాడిన శ్రీశైల క్షేత్రం





క్యూలైన్‌లో భక్తులు








శివుడి ఆకారంలో దీపోత్సవం





దీపాలు వెలిగిస్తున్న భక్తురాలు



శ్రీశైలం, నవంబరు 18(ఆంధ్రజోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కార్తీక మూడో సోమవారం పురస్కరించుకుని ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతులు కార్యక్రమాలను దేవస్థానం వైభవంగా నిర్వహించింది. కార్తీకమాసంలో సోమవారం రోజులలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలను పురస్కరించుకుని క్షేత్రానికి అశేష భక్తజనం తరలివచ్చారు. క్షేత్ర వీధులు భక్తుల రద్దీతో దర్శనమిచ్చాయి. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలి రావడంతో క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. వేకువజాము నుంచే పాతాళగంగలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. కాగా ప్రధాన ఆలయం ఎదుట గల గంగాధర మంటపం వద్ద మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ధ్వజస్తంభానికి ఆకాశ దీపం కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ ఆకాశదీప ప్రజ్వలనకు ముందుగా అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజను నిర్వహించి, దీపప్రజ్వలన, దీపారాధనలు చేశారు. అలాగే కార్తీక మాసోత్సవాల సందర్భంగా దేవస్థానంలో అఖండ శివ భజనలు కొనసాగించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం ఏర్పాటు చేశారు. దర్శనానంతరం భక్తులకు అన్నదాన భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి 3.30 గంటల వరకు భోజనం, సాయంత్రం 6.30 నుంచి అల్పాహారం అందజేశారు.

శ్రీశైలం మహాక్షేత్రంలో కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకొని లోక కల్యాణం కోసం పుష్కరిణి వద్ద దేవస్థానం లక్ష దీపోత్సవం క్రతువును శాస్త్రోక్తంగా చేపట్టారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణ గావించి పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ తర్వాత పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఇందులో భాగంగా వివిధ ఆకృతుల్లో రూపొందించిన దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. ఈ లక్ష దీపోత్సవంలో మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని దీపారాధనలు చేశారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు దీపోత్సవం ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు.

శ్రీశైల క్షేత్రంలో మూడో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పుష్కరిణి వద్ద దశవిధ హారతుల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ప్రతిఏటా కార్తీక మాసంలో వచ్చేటువంటి సోమవారాలు, కార్తీక పౌర్ణమి రోజున పుష్కరిణికి దశవిధ హారతులను నివేదించడం సంప్రదాయంగా వస్తోంది. ఇందులో భాగంగా కార్తీక మాసంలో సోమవారాన్ని పురస్కరించుకుని పుష్కరిణికి వేద మంత్రోచ్ఛరణ నడుమ ఓంకార హారతి, నాగహారతి, త్రిశూల హారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభ హారతి, నక్షత్ర హారతి, కర్పూర హారతులను పుష్కరిణికి వరుసగా సమర్పించారు. కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని పుష్కరిణిని విద్యుత్ దీపాలతో, పుష్పాలతో అలంకరించారు. దశవిధ హారతుల సమయంలో విద్యుద్దీపాలను నిలిపివేసి కేవలం లేజర్‌షోలతో, ఆధ్యాత్మికమైన శబ్దాల నడుమ హారతులను సమర్పించారు.

శ్రీశైలం ఈవోగా చంద్రశేఖర ఆజాద్ బాధ్యతలు



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర ఆజాద్

శ్రీశైలం, నవంబరు 18(ఆంధ్రజోతి): శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్ సోమవారం ఉదయం ఆలయ పరిపాలన భవనంలోని ఈవో చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయాలను అనుసరించి ఆలయ అర్చకులు, వేదపండితులు ఈవోగా భ్యాతలు చేపట్టిన ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్‌కు వేదాశీర్వాదం పలికారు. అనంతరం ఈవో దేవస్థానం అన్ని విభాగాల యూనిట్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి, స్థానిక శాసనసభ్యులు శ్రీశైల క్షేత్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అభివృద్ధి చేయాలన్న ప్రగాఢ సంకల్పంతో ఉన్నారన్నారు. అదేవిధంగా భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, శ్రీశైలక్షేత్ర సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ, గో సంరక్షణ, చెంచు గూడేలలో స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవాలు నిర్వహించడం, క్షేత్రంలో పచ్చదనాన్ని పెంపొందించడం తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.


కర్నూలులో హాస్య బ్రహ్మా..!



కర్నూలులో బ్రహ్మానందంకు స్వాగతం పలుకుతున్న అభిమానులు 6

చట్ట సభలో సిద్ధేశ్వరం

- శాసన మండలిలో గళమెత్తిన కర్నూలు, కడప ప్రజాప్రతినిధులు
- అలుగుపై పరిశీలన చేస్తాం
- మంత్రి నిమ్మల రామానాయుడు
- అలుగు సాధ్యమేనని 2011లో ఐదుగురు నిపుణుల కమిటీ నివేదిక
- కరువుసీమ నీటి కష్టాలు తీర్చే ప్రతిపాదన
- సిద్ధేశ్వరం సీమ రైతుల సెంటిమెంట్



సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం ప్రదేశం

కర్నూలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం అలుగు.. రాయలసీమ వెలుగు అనే నినాదంతో ప్రజా ఉద్యమంగా మారిన నీటిపారుదల సమస్య మీద ఎట్టకేలకు విధాన సభలో సోమవారం వాడివేడి చర్చ జరిగింది. కడప జిల్లాకు చెందిన రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సిద్ధేశ్వరంపై గళమెత్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం సీమ రైతుల సెంటిమెంట్.. అలుగు నిర్మాణంతో శ్రీశైలం జలాశయంలో చేరే పూడికకు అడ్డుకట్ట వేయవచ్చు.. తద్వారా ప్రాజెక్టు జీవిత కాలం పెంచడం ద్వారా తెలుగు రాష్ట్రాలకు సాగునీటి, తాగునీటి కష్టాలు తీర్చవచ్చని వీరు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ఫైలును చెత్తబుట్టలో పడేసింది. అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఐదేళ్లలో సిద్ధేశ్వరం అలుగు గురించి మాట్లాడిన పాపాన పోలేదని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో సిద్ధేశ్వరంపై చట్టసభలో చర్చ జరగడం ఆశావహ పరిణామం. దీంతో సీమ ప్రజల ఆకాంక్షగా, సెంటిమెంట్‌గా మారిన సిద్ధేశ్వరం అలుగు నిర్మాణానికి సానుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని భావించవచ్చు. ఈ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

శ్రీశైలం ప్రాజెక్టు సామర్థ్యం 311 టీఎంసీలు. పూడిక చేరడంతో 215 టీఎంసీలకు పడిపోయింది. తాజాగా అంచనా వేస్తే 180 టీఎంసీలకు చేరుతుందని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. ఏటా 2.5 టీఎంసీల పూడిక జలాశయంలో చేరుతుందని అంచనా. అదే క్రమంలో శ్రీశైలం ఎగువన 1985లో తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 21,500 క్యూసెక్కుల ప్రవాహంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నిర్మించారు. 2004లో అధికారం చేపట్టిన నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 44 వేల క్యూసెక్కులకు పెంచారు. రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీరు అందించే తెలుగుగంగ కాలువ, ఎస్ఆర్‌బీసీ, గాలేరు-నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు (హెచ్ఎన్ఎస్ఎస్)లు నిర్మించారు. కేసీ కాలువ కూడా సాగునీరు అందించేలా ముచ్చుమర్రి లిఫ్ట్ ఏర్పాటు చేశారు. ఆయా ప్రాజెక్టులకు శ్రీశైలం ఎగువ నుంచే కృష్ణా వరద జలాలు మళ్లించాల్సి ఉంది. ఏటేటా పూడిక చేరడం, 854 అడుగుల దిగువకు డ్యాం నీటి మట్టం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కృష్ణా జలాలు సీమ రైతులకు అందని ద్రాక్షే అవుతున్నది.

మిగతా 6లో...

నారసింహా.. నమో నమః

స్వామి, అమ్మవార్లకు నవకలశ తిరుమంజనం



పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు 7

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా..!

7

ఏడు ఊర్ల గవి

- సహజసిద్ధమైన జలధార



6

ముఖ గుర్తింపు హాజరుతోనే జీతభత్యాలు: కలెక్టర్

7

ప్రజా సమస్యలను పరిష్కరించండి

- కలెక్టర్ రాజకుమారి
- పీజీఆర్ఎస్‌కు 183 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి


నంద్యాల కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు నాణ్యతతో నిర్ణీత కాల పరిమితి లోగా పరిష్కరించేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుండి ఇప్పటి వరకు 4480 దరఖాస్తులను స్వీకరించగా వాటిలో 3918 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ఇంకా పెండింగ్‌లో వున్న నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాల్సిన 540 దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించలేని స్థితిలో అధికారులు ఉండకూడదని స్పష్టం చేశారు. నాణ్యమైన రీతిలో సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టర్, జేసీ లాగిన్‌లలో రీ ఓపెన్ అవుతాయని, ఈ విషయాన్ని అధికారులందరూ దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి రెడ్రెస్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో 183 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.

ఏడు ఊర్ల గవి

●సహజసిద్ధమైన జలధార ●తరలివస్తున్న భక్తులు, ప్రకృతి ప్రేమికులు



గుహలోని విశాలమైన ప్రాంతం



గవిలోకి వెళ్తున్న మార్గం


గడివేముల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దివిటి దొంగల నుంచి ప్రాణాలు కాపాడిన ఆనాటి ఏడు ఊర్ల గవి నేడు ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోంది. పచ్చని చెట్లు, ఎర్రమల సానువులలో ప్రకృతి ఒడిలో సహజసిద్ధంగా ఏర్పడిన ఏడు ఊర్ల గవి ఎన్నో విశేషాల నెలవు. నంద్యాల జిల్లా గడివేముల మండలంలోని పైబోగుల గ్రామ సమీపంలో ఉన్న ఈ గవిలో విశాలమైన గుహ, శివలింగం, నిత్యం శివుడిని అభిషేకిస్తున్న నీటి ధార.. ప్రజలను ఆకర్షిస్తూ ఆధ్యాత్మిక క్షేత్రంగా పరిఢవిల్లుతోంది. పూర్వం ఈ ప్రాంతంలో దివిటి దొంగల బెడద ఎక్కువగా ఉండేది. వారి నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు ఏడు ఊర్ల ప్రజలు ఈ గవిలో కొన్నేళ్ల పాటు తలదాచుకునేవారు. గుహ ముఖద్వారం చిన్నగా ఉన్నా లోనికి వెళ్లే కొద్దీ విశాలంగా ఉంది.


● నిత్యం శివుడిని అభిషేకిస్తున్న నీటి ధార

ఏడు ఊర్ల గవి చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎక్కడా నీటి నిల్వలు లేవు. ఈ గుహలోని శివలింగంపై మాత్రం నిత్యం నీటిధార పడుతూ భక్తులను ఆశ్చర్యచకితులను చేస్తోంది. గుహలో ఉన్న శివలింగానికి భక్తులు పూజలు చేస్తుంటారు. ముఖ్యంగా శివరాత్రి, కార్తీకమాస పర్వదినాల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తుంటారు. ప్రభుత్వం స్పందించి ఈ గవిని అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందుతుంది.

● ఏడు ఊర్ల గవికి ఎలా చేరుకోవాలంటే..

గడివేముల మండలం నుంచి 3 కి.మీ దూరంలో ఉన్న బొల్లవరం చేరుకొని అక్కడి నుంచి పైబోగులకు వెళ్లే మట్టిదారిలో 2.50 కి.మీ వెళ్తే ఈ గవిని చేరుకోవచ్చు.





గవిలో ఉన్న శివలింగం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీజీ వెంకటేశ్, బ్రహ్మానందం

కర్నూలులో హాస్య బ్రహ్మ..!

కర్నూలు కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సినీ హాస్య నటుడు బ్రహ్మానందం సోమవారం కర్నూలు నగరంలో సందడి చేశారు. ఆయనను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో బిర్లాగేటు సమీపంలోని స్కైలైన్ స్క్వేర్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. 'జఫ్ఫా టీ ఫ్రాంచైజీని సినీ నటుడు బ్రహ్మానందం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌తో కలిసి ప్రారంభించారు.



సినీ నటుడు బ్రహ్మానందంను చూడడానికి వచ్చిన జనం

పేదలకు గూడు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

● ధనికులకు వత్తాసు.. పేదలకు అన్యాయం

● మహాధర్నాలో వక్తల ఆగ్రహం



ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు



ర్యాలీ చేస్తున్న కార్మికులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలకు గూడు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పి. రామచంద్రయ్య ఆరోపించారు. సోమవారం సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో సీపీఐ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు వేలాదిమంది లబ్ధిదారులతో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన మహాధర్నాకు నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ నగరంలో పేదలు నివాసం ఉండేందుకు 3 సెంట్ల స్థలాన్ని కేటాయించాలన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఒక్క సెంటు స్థలం సరిపోదని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆనాడే వైసీపీ ప్రభుత్వానికి చెప్పినప్పటికీ ఖాతరు చేయకుండా ముందుకు వెళ్లిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేసి రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సౌకర్యాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర సహాయ కార్యదర్శులు జి.చంద్రశేఖర్, మహేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

పాసు పుస్తకాలు మార్చేసుకున్నారు

● ఫేక్ ట్రేడింగ్‌తో మోసం

● పోలీసు స్పందనకు 90 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

కర్నూలు క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట సమీపంలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 90 ఫిర్యాదులు అందాయి.

● ముంబాయికి వలస వెళితే తన పేరుమీద ఉన్న 17 ఎకరాల 80 సెంట్ల పొలాన్ని వేరే వ్యక్తులు తమ పేరుపై పాసుపుస్తకాలు చేయించుకున్నారని, ఆర్ఐ, వీఆర్‌వోలతోపాటు ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోసిగి మండలం, కందుకూరి గ్రామానికి చెందిన ఈరన్న అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

● తాను ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేస్తుంటానని, ఇటీవల సీఐఎస్‌వీ అనే ట్రేడింగ్ యాప్ నుంచి పెట్టుబడి పెట్టాలని లింకు రావడంతో ఆ లింకు క్లిక్ చేసి తన బ్యాంకు అకౌంట్ నుంచి రూ.4.80 లక్షలు పెట్టుబడిగా పెట్టానని, విత్‌డ్రా చేసుకుంటే తిరిగి రావడం లేదని, తనకు న్యాయం చేయాలని కర్నూలు సంతోష్‌నగర్‌కు చెందిన చాంద్‌బాషా ఫిర్యాదు చేశారు.

● వెంకాయపల్లె ఎల్లమ్మ గుడి ఎదురుగా ఉన్న ఒక ప్రైవేటు వెంచర్‌లో సత్యబాబు అనే వ్యక్తి రూ.24 లక్షలు తీసుకొని ఇల్లు ఇవ్వడం లేదని, డబ్బులు కూడా వాపస్ చేయడం లేదని కర్నూలుకు చెందిన లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు.

● కర్నూలు పాతబస్టాండులో లక్ష్మీ జువెలర్స్‌కు చెందిన నాయుడు అనే వ్యక్తి బంగారం ఇస్తానని డబ్బులు తీసుకొని పరారయ్యాడని, తనకు న్యాయం చేయాలని వజనకుమారి అనే మహిళ ఫిర్యాదు చేసింది.

నారా రోహిత్‌కు మల్లెల రాజశేఖర్ పరామర్శ



నారా రోహిత్‌ను పరామర్శిస్తున్న టీటీడీ పాలకమండలిసభ్యుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కన్ను మూసిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు కుమారుడు నారా రోహిత్ టీటీడీ పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ పరామర్శించారు. సోమవారం నారావారి పల్లె గ్రామానికి వెళ్లిన మల్లెల రాజశేఖర్ నారా రోహిత్‌ను ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. మృతి చెందిన నారా రామూర్తి నాయుడు ఎమ్మెల్యేగా చంద్రగిరి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. అలాగే సీఎం చంద్రబాబును కూడా కలిశారు. ఈయన వెంట అనంతపురం జిల్లా సింగనమల ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఉన్నారు.

మహిళపై వైసీపీ వర్గీయుల దాడి

స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధిత మహిళ



గాయపడ్డ ఆదిలక్ష్మి

పత్తికొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదంలో ఓ మహిళపై వైసీపీ వర్గీయులు దాడి చేసి గాయపరచిన సంఘటన సోమవారం పత్తికొండ మండలం దూదేకొండ గ్రామంలో చోటుచేసుకొంది. బాధితురాలు ఆదిలక్ష్మి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దూదేకొండ గ్రామానికి చెందిన ఆదిలక్ష్మికి గ్రామకంఠం స్థలంలో గత ముప్పై ఏళ్ల క్రితం ప్రభుత్వ అధికారులు ఇంటి స్థలం కేటాయించారు. హౌసింగ్ కింద పక్కా ఇళ్లు మంజూరు కావడంతో ఇళ్లు నిర్మించుకుంది. అయితే అమె తన ఇంటి ముందు ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి తన పేరున పట్టా పొందింది. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులైన రామాంజినేయులు (అప్పటి వలంటీర్) లతో పాటు పెద్దయ్య మరికొందరు కలసి ఆదిలక్ష్మి ఇంటి ముందు భాగాన షెడ్డు (రేకుల బంకు) వేశారు. దారికి అడ్డుగా తన ఇంటి ముందు తన స్థలంలోనే షెడ్డు ఎలా వేస్తారని నిలదీసింది. షెడ్డు నిర్మాణం పనులను చేపడుతుండగా అడ్డుకోబోయిన తనను కట్టెలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారని బాధిత మహిళ విలేకర్ల ఎదుట వాపోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో దొంగ పట్టాలు సృష్టించుకొని, తన స్థలాన్ని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొని, తనను, కుటుంబ సభ్యులను చంపుతామని బెదిరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై సీఐ జయన్నను వివరణ కోరగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

హిందూ సంప్రదాయాలను కాపాడుకోవాలి

- హిందూ ధర్మపరిరక్షణ కర్త మనోహర్‌దాస్ గురూజీ



ప్రసంగిస్తున్న మనోహర్‌దాస్‌గురుజీ

పగిడ్యాల, నవంబరు 18,(ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో హిందూ మత సంప్రదాయలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని తిరుపతి హిందూ ధర్మపరిరక్షణ కర్త రాథ మనోహర్‌దాస్ గురుజీ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పగిడ్యాల గ్రామంలోని ఉమమహేశ్వర దేవాలయం వద్ద కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందూ ధర్మ పరిరక్షణ కర్త రాథమనోహర్ దాస్ గురుజీ, బైలూరుయోగీష్ ప్రభు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంబూపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర మహిళామోర్చా నాయకురాలు గీతారాణి తదితరులు హాజరయ్యారు.

సమానత్వాన్ని బోధించిన భక్త కనకదాసు

కలెక్టర్ రంజిత్‌బాషా



భక్త కనకదాసుకు పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

కర్నూలు ఎడ్యుకేషన్ , నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తన కీర్తనల ద్వారా భక్తి తత్వాన్ని, సామాజిక సమానత్వాన్ని బోధించిన గొప్ప తత్వవేత్త భక్తకనకదాసు అని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. సోమవారం భక్త కనకదాసు జయంత్యుత్సవాన్ని పురస్కరించుకని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, జిల్లా వెనుకబడిన తరగతుల సహకార సంఘం లిమిటెడ్ అధ్వర్యంలో బీసీ సంక్షేమ భవన్‌లో శ్రీ భక్త కనకదాసు విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశభవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ భకత్త కనకదాసు 1509 సంవత్సరంలో జన్మించి 1609 సంవత్సరం దాకా జీవించారన్నారు. సైన్యంలో కూడ పని చేసి యుద్ధంతో గాయపడి, తదుపరి భక్తి మార్గంలోకి వెళ్లి ఎన్నో కీర్తనలను, రచనలను సమాజానికి అందించారని కొనియాడారు. 417 ఏళ్ల తరువాత కూడ భక్తకనకదాసు జయంతిని ఇప్పటికి నిర్వహించుకుంటున్నామంటే వారి నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉందని అన్నారు.

చట్టసభలో సిద్ధేశ్వరం

(5వ పేజీ తరువాయి)

ఈ సమస్యకు ఏకైక పరిష్కారం సంగమేశ్వరం చెంతన రెండు కొండల మధ్యలో 'సిద్ధేశ్వరం అలుగు' నిర్మాణమేనని ఏనాడో సాగునీటి నిపుణులు తేల్చారు. ఈ అలుగు సాధన కోసం రాయలసీమ సాగునీటి సాధన సమితి సహా వివిధ రాయలసీమ సంస్థలు పోరాటం చేస్తున్నాయి. 2016 మే 31న వేలాది మంది రైతులు సిద్ధేశ్వరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆనాడు టీడీపీ అధికారంలో ఉంటే.. వైసీపీ ప్రతిపక్షంలో ఉంది. రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నాయకులు రైతుల ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. అధికారం చేపట్టాక ఐదేళ్లు సిద్ధేశ్వరం అలుగు ఊసే ఎత్తలేదు. తాజాగా టీడీపీ కూటమి అధికారంలో ఉన్నప్పటికీ .. ఆ పార్టీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మండలిలో సిద్ధేశ్వరం గళం వినిపించారు.



● 2011లోనే నిపుణుల కమిటీ ఆమోదం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం కోసం 2011 మార్చి 11న అప్పటి ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఏడబ్ల్యూ) ఎంకే రెహమన్ చైర్మన్/కన్వీనర్‌గా ఐదుగురు ఇంజనీరింగ్ నిపుణులతో కమిటీ వేశారు. ఈ కమిటీలో మీడియం ఇరిగేషన్ ఈఎన్‌సీ పీఎస్ఆర్ సుబ్రమణ్యం, ఇరిగేషన్ ఈఎన్‌సీ సి. మురళీధర్, డబ్ల్యూటీపీ డైరెక్టర్ ఎం. సాంబమూర్తి, కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ సీఈ కె. జలంధర్ సభ్యులుగా ఉన్నారు. అధ్యయనం తరువాత ఈ కమిటీ 2011 ఆగస్టు 19న ఆ కమిటీ సమావేశమై కీలక అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. శ్రీశైలం ఎగువన కృష్ణా నదిపై రాయలసీమ కరువు పీడిత జిల్లాలకు సాగు, తాగునీరు అందించే 8 ప్రాజెక్టులు ఉన్నాయి. శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి పేరిట నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాం నీటి మట్టం 854 అడుగులకు తగ్గిపోతే సీమ ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయలేని పరిస్థితి ఉంది. అదే జరిగితే కరువుసీమ జిల్లాలకు తాగు, సాగునీరు అందడం కష్టం అవుతున్నది. దీంతో రాయలసీమ కరువు ప్రాంతంలో తాగు, సాగునీటి అవసరాలు తీర్చాలంటే సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం అవసరం ఉందని నిపుణుల కమిటీ నిగ్గుతేల్చింది. నాటి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అదే క్రమంలో 854 అడుగుల నీటి మట్టంలో అలుగు నిర్మిస్తే.. శ్రీశైలంలో ఏటా చేరే 2.5 టీఎంసీ పూడికను సంగమేశ్వరం వెనుకాలే ఆపేసి డ్యాం జీవితకాలం పెంచవచ్చు.. అధిక వరదలు వస్తే పోతిరెడ్డిపాడు నుంచి వరదను మళ్లించి డ్యాంకు రక్షణ కల్పించవ్చని సీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం, వైసీపీ ప్రభుత్వాలు రెండూ పట్టించుకోలేదు. దీంతో అప్పట్లో ఆ రెండు ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ విడత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో విధాన సభ వేదికగా సిద్ధేశ్వరం ఆ పార్టీ ఎమ్మెల్సీలే చర్చనీయాంశం చేయడం స్వాగతించాల్సిన పరిణామం.

● సిద్ధేశ్వరంపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

రాయలసీమ సెంటిమెంట్‌గా మారిన సిద్ధేశ్వరం అలుగు నిర్మించాల్సిందే అని కడప జిల్లాకు చెందిన రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గళమెత్తారు. ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలు, ఆంధ్రప్రదేశ్ మొత్తానికి ఏ విధరంగా ప్రయోజనమో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అంకెలతో సహా వివరించారు. అలుగుపై ప్రజల్లో ఆకాంక్ష బలంగా ఉంది.. రైతుల ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారు... ప్రభుత్వం తప్పక చేపట్టాలని మంత్రి ఫరూక్ మండలిలో వాయిస్ వినిపించారు.

● పరిశీలిస్తాం

ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, మంత్రి ఫరూక్ అడిగిన ప్రశ్నలకు మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇస్తూ సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం వల్ల అదనపు నీటి సామర్థ్యం ఉంటే తప్పకుండా పరిశీలించి చేపడుతామని వివరించారు. 2013 జూన్ 26న అప్పటి ప్రభుత్వం 2120 మెమో ఇచ్చింది. శ్రీశైలం ఫోర్‌షోర్ ఏరియాలో మరో డ్యాం నిర్మాణం వల్ల అదనంగా నీటి నిల్వ ఉండదని, ఆ ప్రాజెక్టు అవసరం లేదని తేల్చిచెప్పారు. 2016-17లో మళ్లీ సిద్ధేశ్వరం ప్రతిపాదన వచ్చింది. అంతర్ రాష్ట్ర సమస్య ఉందని, దీని వల్ల ప్రయోజనం లేదని 2018 సెప్టెంబరు 12న ఆనాటి ఈఎన్‌సీ కూడా లేఖ ఇచ్చారని ఆయన అన్నారు. రాయలసీమ ప్రాంతానికి నీటి ఇచ్చే విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే హంద్రీనీవాకు రూ.2,500 కోట్లు కేటాయించి విస్తరణ చేపట్టబోతున్నామని తెలిపారు. సిద్ధేశ్వరంపై కూడా అధ్యయనం చేసి అదనపు నీటి నిల్వకు అవకాశం ఉంటే .. రాయలసీమ రైతులకు ఉపయోగకరంగా ఉందంటే తప్పక చేపడుతామని మంత్రి అన్నారు.

● మంత్రి నిమ్మల డొంకుతిరుగుడు సమాధానం

సిద్ధేశ్వరంపై మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం డొంక తిరుగుడుగా ఉంది. 2011లోనే ఐదుగురు నిపుణుల కమిటీ సిద్ధేశ్వరం నిర్మాణం అవసరం ఉందని నివేదిక ఇచ్చింది. ఏటా 2.50 టీఎంసీలు పూడిక శ్రీశైలంలో చేరుతున్నది. ఇప్పటికే 311 టీఎంసీలు నుంచి 215 టీఎంసీలకు తగ్గింది. తాజాగా అంచనా వేస్తే 180 టీఎంసీలు కూడా ఉండదు. అంటే దాదాపు 100 టీఎంసీలు సామర్థ్యం కోల్పోయాం. సిద్ధేశ్వరం అలుగు ద్వారా పూడికకు కట్టడి చేసి శ్రీశైలం డ్యాం జీవితకాలం పెంచవచ్చు. అదనపు సామర్థ్యం ఉండదని ప్రతిపాదన తుంగలో కలిపే ప్రయత్నం చేయకూడదు.

- బొజ్జా దశరథరామిరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు

నారసింహా.. నమో నమః

స్వామి, అమ్మవార్లకు నవకలశ తిరుమంజనం



ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్య క్షేత్రం అహోబిలం లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో కార్తీకమాస పూజలు విశేషంగా నిర్వహిస్తున్నారు. కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వాహకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవీ సమేత ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూర్తులకు లక్ష్మీవనంలోని ఉసిరి చెట్టు కింద పూజలు నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాత్కాలిక పదోన్నతి కల్పించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిలాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో పని చేస్తున్న వార్డు అమ్యూనిటీస్‌కు రోస్టర్ ప్రకారం మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎంఏఈఈ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా రోస్టర్ పద్ధతిలో తాత్కాలికంగా పదోన్నతులు కల్పించాలని అనంతపురం పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి కమిషనర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు-7, ఆదోని-4, ఎమ్మిగనూరు-1, గూడూరు-2, నంద్యాల-2, ఆత్మకూరు-2, ఆళ్లగడ్డ-2, నందికొట్కూరు-1, డోన్-2 ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఇంజనీర్ ఇన్ చీఫ్ ఇప్పటికే వార్డు అమ్యూనిటీస్‌కు తాత్కాలికంగా పదోన్నతులు కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. సీనియారిటీ ప్రకారమే వార్డు అమ్యూనిటీస్‌కు ఎంఏఈఈ/ఎంఏఈలు పదోన్నతులు కల్పించాలని తెలిపారు. అమ్యూనిటీస్ వివరాలను ఇంజనీర్ ఇన్ చీఫ్‌నకు పంపించాలని చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకందుకూరు గ్రామానికి చెందిన ఓబయ్య(48) సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరి ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓబయ్య గ్రామ పరిసరాల్లో మేకల కోసం ఆకులు కోస్తుండగా కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. చికిత్స నిమిత్తం బాధితుడిని కుటుంబ సభ్యు లు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా ఓబయ్య అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారన్నారు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ హరి ప్రసాద్ తెలిపారు.

నిప్పుల వాగులో బాలిక గల్లంతు

వెలుగోడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలంలోని అయ్యవారిపల్లి వద్ద నిప్పులవాగులో ఓ బాలిక గల్లంతైంది. మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన హరినాథ్‌బాబు తమ కుటుంబ సభ్యులతో కలిసి నోముల పండుగ కోసం తన అత్తగా రింటికి వచ్చారు. అయ్యవారిపల్లిలో హరినాథ్‌బాబు కూతుళ్లు భవ్యశ్రీ, బానేశ్వర్‌లను తీసుకొని మామ రామచంద్రుడు నిప్పులవాగుకు స్నానం చేసేందుకు తీసుకెళ్లారు. నదిలో స్నానం చేస్తుండగా భవ్యశ్రీ, బానేశ్వరులు నీటి ఉధృతికి కొట్టుకుపోయారు. రామచంద్రుడు బానేశ్వర్‌ను కాపాడగా పదేళ్ల చిన్నారి భవ్యశ్రీ కొట్టుకుపోయింది గాలించినన ఆచూకీ లభించలేదు దీంతో కుటుంబ సభ్యులు వెలుగోడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాతగారి ఇంటికి పండుగ కోసం వచ్చి చిన్నారి నీటి ఉధృతిలో కొట్టుకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీయ్యారు.

యువకుడి హత్య

కర్నూలు క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోగల సంకల్‌బాగ్ కేశవరెడ్డి స్కూల్ సమీపంలో కృపానందం అలియాస్ ఆనంద్ (25) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. స్థానిక ధర్మపేటకు చెందిన కృపానందం గౌండా పని చేస్తుంటాడు. సోమవారం మధ్యాహ్నం తర్వాత రోజా వీధికి చెందిన మరో యువకుడు షేక్ అజీజ్‌తో కలిసి బైటికి వెళ్లి కల్లు తాగారు. ఆ తర్వాత కేశవరెడ్డి స్కూల్ పక్కనే ఉన్న పాడుబడిన నిర్మాణంలో ఉన్న భవనంలోకి వెళ్లి ఇద్దరూ కలిసి ముక్కలాట ఆడారు. ఈ ఆటలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. క్షణికావేశానికి గురైన షేక్ అజీజ్ పక్కనే ఉన్న రాయి తీసుకొని కృపానందం తలపై కొట్టాడు. దీంతో కృపానందం అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఆ తర్వాత షేక్ అజీజ్ పరారయ్యాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి హత్య జరిగిన తీరును పరిశీలించారు. కృపానందం తల్లి ఏసమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజారావు తెలిపారు.

ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఏఎస్పీ ఎన్. యుగంధర్‌బాబుతో కలిసి పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యా దులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరిస్తామ న్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంటుందన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు తమకు జరిగిన అన్యాయాలను ఎస్పీకి వినతి రూపంలో విన్నవించుకున్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

కారు, రెండు ద్విచక్ర వాహనాలు సీజ్

కోసిగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కోసిగిలో 45 బాక్సుల భారీగా కర్ణాటక మద్యంతో పాటు ఒక కారు, రెండు ద్విచక్రవాహనాలు సీజ్ చేసి 5మందిపై కేసు నమోదు చేసినట్లు కోసిగి సీఐ మంజునాథ, ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో సీఐ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా కోసిగి మండల పరిధిలోని పల్లెపాడు సీఎస్‌ఐ చర్చి దగ్గర కర్ణాటకకు చెందిన కారులో 21 బాక్సుల అక్రమ కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన ఈడిగ రామును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కర్ణాటకకు చెందిన మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అలాగే కందకూరు గ్రామంలోని క్రాస్ రోడ్డులో కడదొడ్డి గ్రామానికి చెందిన అంజనేయులు, రామాంజి రెండు మోటారు సైకిళ్లపై 24 అక్రమ కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. రెండు కేసుల్లో కలిపి 45 బాక్సుల కర్ణాటక మద్యంతో పాటు ఒక కారు, రెండు బైకులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఏఎస్‌ఐలు తిరుపాల్ నాయక్, నాగరాజు సిబ్బంది శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, షేక్షావలి ఉన్నారు.



పట్టుబడిన కర్ణాటక మద్యం, కారు, బైక్‌లు, నిందితులను చూపుతున్న పోలీసులు

నీటి సంఘాల ఎన్నికలు వాయిదా!

- అక్టోబరు 21న కలెక్టరు నోటిఫికేషన్ జారీ
- ఓటర్లు జాబితాను విడుదల చేయని రెవెన్యూ అధికారులు
- 23న జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడినట్లే..
- అసెంబ్లీ సమావేశాలు తరువాత మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం



కర్నూలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొమ్మిదేళ్ల తరువాత సాగునీటి సంఘాల ఎన్నికలకు టీడీపీ కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అక్టోబరు 21న జిల్లా కలెక్టరు నోటిఫికేషన్ జారీ చేశారు. షెడ్యూలు ప్రకారం 23న ఎన్నికలు జరగాల్సి ఉంది. గ్రామాల్లో రాజకీయ సందడి మొదలైంది. పదవులపై ఆసక్తి ఉన్న నాయకులు రైతులను కలసి మద్దతు కూడగడుతున్నారు. మరో పక్క అధికార యంత్రాంగం ఎన్నికల సిబ్బంది నియామకం.. ఓటర్ల జాబితా తయారీలో నిమగ్నం అయ్యారు. అయితే 13న ఓటర్ల జాబితా ప్రకటించకపోడం వల్లే ఎన్నికలు వాయిదా పడినట్లు తెలుస్తున్నది. ఈ నెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు లేకుండా ఎన్నికలు జరిగితే రాజకీయంగా నష్టపోయే అవకాశం ఉండడంతో ప్రభుత్వం వాయిదా వేసిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు తరువాత మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయవచ్చని అధికారులు అంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 285 సంఘాలకు ఎన్నికలు జరాగాల్సి ఉంది.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కేసీ కెనాల్, కేసీ కెనాల్, తుంగభద్ర దిగువ కాలువ, రాంపురం చానెల్, గాజులదిన్నె ప్రాజెక్టు, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, హంద్రీనీవా ప్రాజెక్టు, హెచ్చెల్సీ ఆలూరు బ్రాంచి కెనాల్, చిన్ననీటి పారుదల శాఖ పరిధిలో కర్నూలు జిల్లాలో 310, నంద్యాల జిల్లాలో 320 చెరువులు ఉన్నాయి. వీటితో వంద ఎకరాలు పైబడిన చెరువులు 145 వరకు ఉన్నాయని ఇంజనీర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మేజర్ ప్రాజెక్టుల పరిధిలో 212 సాగునీటి సంఘాలు, మీడియం ప్రాజెక్టు పరిధిలో 26 సాగునీటి సంఘాలు, మైనర్ ఇరిగేషన్ (చిన్ననీటి పారుదల) పరిధిలో 146 సాగునీటి సంఘాలు ఉన్నాయి. సాగునీటి ఎన్నికలు తరువాత కేసీ కెనాల్, ఎల్లెల్సీ, తెలుగుగంగ, ఎస్సార్బీసీ కాలువ పరిధిలో డిస్ట్రిబ్యూటర్ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటారు. రాష్ట్ర విభజన తర్వాత 2015-16లో ఆనాటి టీడీపీ ప్రభుత్వం సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. 2019 మేలో కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వంలో వీటి ఎన్నికలు నిర్వహించలేదు. వైసీపీ నాయకులు, సానుభూతి పరులకే నామినేటెడ్ పదవులు పంపకాలు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల్లో రైతులను అందులో భాగస్వామ్యం చేయాలని, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలను ఆధునికీకరించాలనే సంకల్పంతో ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టింది.

● మూడు దశల్లో ఎన్నికలు:

● భారీ (మేజర్), మధ్యతరహా (మీడియం) ప్రాజెక్టుల పరిధిలో ఒక్కో సాగునీటి సంఘం పరిధిలో 100-120 మంది రైతులు, మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) పరిధిలోని నీటి సంఘాల్లో దాదాపు 30-50 మంది రైతులు సభ్యులుగా ఉంటారని అధికారులు తెలిపారు. ఒక్కో సంఘంలో ఆరుగురు ప్రాదేశిక నియోజకవర్గం(టీసీ) సభ్యులు ఉంటారు.

● **తొలి దశ:** సాగునీటి సంఘాలు (డబ్ల్యూయూఏ) పరిధిలో రెవిన్యూ గుర్తించిన ఓటు హక్కు కలిగిన రైతులు ఆరుగురు టీసీ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ ఈ నెల 23న జరగాల్సి ఉండింది. టీసీ సభ్యుల్లో ఇద్దరిని అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నుకుంటారు.

● **రెండవ దశ:** డిస్ట్రిబ్యూటరీల పరిధిలో ఉండే సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు సమావేశమై డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.

● **మూడవ దశ:** ఉమ్మడి జిల్లాలో కేసీ కెనాల్, ఎల్లెల్సీ, ఎస్సార్బీస్, తెలుగుంగ ప్రాజెక్టులు కమిటీలు ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు సమావేశమై ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఎన్నుకుంటారు. సాగునీటి వ్యవస్థలో డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష పదవులకు మంచి ప్రాధాన్యత ఉంటుంది.

● కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలో జరిగే మరమ్మతులు, ఆధునికీకరణ పనులు ఈ కమిటీ పర్యవేక్షణలోనే జరుగుతాయి. సాగునీటి పంపిణీలో ముఖ్యమైన బాధ్యత వీరికే ఉంటుంది..

● అటు అధికారులు.. ఇటు రాజకీయ నాయకులు:

సాగునీటి సంఘాలు టీసీ సభ్యుల ఎన్నిక మొదలు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు పూర్తి చేసే వరకు 40 రోజులు పడుతుంది. అక్టోబరు 9న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలుపగా.. 21న కలెక్టరు పి. రంజిత్‌బాషా ఎన్నికల నిర్వహణకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. సాగునీటి సంఘాల వారిగా డీఈఈ, ఏఈఈ స్థాయి ఇంజనీర్లను ప్రత్యేక అధికారులను నియమించారు. వీరి పర్యవేక్షణలోనే ఎన్నికలు నిర్వహించాలి. రెండు జిల్లాల్లో ఇంజనీరింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు నీటి సంఘాల ఎన్నికలు బలం చేకూరుస్తాయని, పల్లెసీమల్లో జనం నాడి ఎటువైపు ఉందో తెలుస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దీంతో అధికర టీడీపీ కూటమి పార్టీలు, ప్రతిపక్ష వైసీపీ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అప్పుడే గ్రామాల్లో వేడి రాజుకుంది.

● ఓటర్ల జాబితా తయారు కాకపోవడమే:

ఉమ్మడి జిల్లాలో ఆయా సాగునీటి వనరులు కింద దాదాపు 9.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 2015-16లో భూయాజ్యమాన్యం హక్కు కలిగిన ఆయకట్టు రైతులను ఓటర్లుగా గుర్తించి ఎన్నికలు నిర్వహించారు. ఆ తరువాత తొమ్మిదేళ్లు ఎన్నికలు జరపలేదు. ఈ మధ్యకాలంలో చాలామంది భూముల అమ్మకాలు చేయడంతో పాటు అన్నదమ్ములు విభాగాలు జరిగిన రెవిన్యూ రికార్డుల్లో భూయాజమాన్యం హక్కు కలిగిన రైతులు మారిపోయారు. దీంతో సాగునీటి కాలువ పరిధిలోని ఇంజనీర్లు, రెవిన్యూ అధికారులు (తహసీల్దార్లు) సమన్వయంతో ఆయకట్టు రైతులను గుర్తించి ఓటర్ల జాబితాను తయారు చేయాలి. ఇందుకు జిల్లాస్థాయి ప్రత్యేక అధీకృత రెవెన్యూ అధికారులను నియమించారు. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం అయితే ఈ నెల 13వ తేదినాటికే ఓటర్ల జాబితా ప్రకటించాల్సి ఉండేది. అయితే.. ఓటర్ల జాబితాను ప్రకటించకపోవడం, ఈ నెల 11 నుంచి 22వ తేది వరకు అసెంబ్లీ సమావేశాలు ఉండడంతో నీటి సంఘాల ఎన్నికలు వాయిదా వేసినట్లు తెలుస్తున్నది. అసెంబ్లీ సమావేశాలు పూర్తయిన తరువాత మళ్లీ నోటిషికేషన్ జారీ చేయవచ్చని ఇంజనీర్లు పేర్కొంటున్నారు.



నీటితో నిండుగా ప్రవహిస్తున్న ఎల్లెల్సీ కాలువ

● ఉమ్మడి జిల్లాలో సాగునీటి సంఘలు:

ప్రాజెక్టు	నీటి సంఘాలు
కర్నూలు జిల్లా:	
కేసీ కెనాల్	2
తుంగభద్ర ప్రాజెక్టు ఎల్లెల్సీ	58
ఆలూరు బ్రాంచి కెనాల్	6
హంద్రీ నీవా కాలువ	3
గాజులదిన్నె ప్రాజెక్టు	12
రాంపురం ఛానల్ కెనాల్	1
మైనర్ ఇరిగేషన్ చెరువులు	41
మొత్తం	123
నంద్యాల జిల్లా:	
కేసీ కాలువ	52
శ్రీశైలం కుడి కాలువ (ఎస్సార్బీసీ)	50
తెలుగుగంగ కాలువ	47
శివభాష్యం ప్రాజెక్టు	7
మైనర్ ఇరిగేషన్ చెరువులు	104
మైలవరం ప్రాజెక్టు	1
మొత్తం	261

డీఎంహెచ్‌వో, కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట బైఠాయించిన ఆశా వర్కర్లు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్ల ఒప్పంద 60 జీవోను ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు పి. నిర్మల మ్మ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్ట రేట్, డీఎంహెచ్‌వో కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా అమె మా ట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ రాష్ట్ర ప్రతినిధి ఒప్పందంతో గత ఫిబ్రవరి లో ప్రభుత్వం చేసుకున్న ఒప్పంద జీవోల ను అమలు చేయాలని కోరారు. ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం పొంది ఆరు నెలలు కావస్తున్నా హామీలు అమలు చేయలేక పోవడం దారుణమన్నారు.

ముఖ గుర్తింపు హాజరుతోనే జీతభత్యాలు

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగు లకు ముఖ గుర్తింపు హాజరు ఆధారంగానే జీతాల చెల్లింపు ఉంటుందని, ఈ మేరకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ, ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవా రం కలెక్టరేట్‌లోని పీజీఆ ర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల వేదికలో భాగంగా జిల్లా అధికారులతో పలు అభివృద్ధి అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ శాండ్ మేనేజ్‌మెంట్, ఎస్పీ సీఐ యాక్టివేషన్, అపార్ ఐడి జనరేషన్, హౌస్‌హోల్డ్ ఇమేజ్ జియో ట్యాగింగ్ సర్వే తదితర వాటి ఆధారంగా లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్స వాల్లో శంకుస్థాపన చేసిన 1026 సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో భాగంగా 700 పనులు ప్రారంభించి 70 పనులు పూర్తి చేశారన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

చిన్నారిపై అత్యాచార యత్నం బాధాకరం

పాఠశాలలో డీఈవో విచారణ



చాగలమర్రిలో విచారణ జరుపుతున్న డీఈవో, జీసీడీవో

చాగలమర్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారిపై అత్యాచార యత్నం బాధాకరమని నంద్యాల డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం చాగలమర్రిలో బాలిక చదువుతున్న పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యంతోపాటు ఉపాధ్యాయులు, చిన్నారి తల్లిదండ్రులతో పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని అన్నారు. పోలీసు అధికారులను కలిసి జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. విచారణ జరిపిన నివేదికలను కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్‌కు అందజేస్తామని అన్నారు. ఈ విచారణలో జీసీడీవో నాగసువర్చల, డిప్యూటీ డీఈవో బేగ్, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని మహిళ మృతి

కర్నూలు నవంబరు, (ఆంధ్రజ్యోతి): కర్నూలు రైల్వే స్టేషన్ పరిధిలో కర్నూలు దూపాడు మధ్యలో రైలు నుంచి జారి పడి ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్.ఐ కిరణ్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వయస్సు 60 ఏళ్లు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. శరీరంపై పసుపురంగు చీర మీద నీలం రంగు పూల డిజైన్ ఉంది. రెండు చేతులపైన పూల డిజైన్ పచ్చబొట్లు ఉన్నాయి. చేతి వేలికి లక్ష్మీదేవి బొమ్మ ఉన్న రాగి ఉంగరం ఉంది. అలాగే కుడిచేతికి నాలుగు వెండి కడియాలు ఉన్నాయి. మృతురాలి వివరాలు తెలిసిన వారు 9440627654 నెంబరుకు ఫోన్ చేయాలని రైల్వే సీఐ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

చెంచుల సమస్యలు పరిష్కరించేందుకే గ్రీవెన్స్

- శ్రీశైలం ఐటీడీఏ ఉద్యానశాఖ ఏడీ ధనుంజయరెడ్డి



చెంచుల నుంచి వినతిపత్రాన్ని అందుకుంటున్న ఉద్యానశాఖ ఏడీ

ఆత్మకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నల్లమల చెంచు గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకే ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు శ్రీశైలం ఐటీడీఏ ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ధనుంజయరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ కేజీనాయక్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వారు చెంచుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించిన దరఖాస్తులను స్వీకరించారు. సమావేశంలో ఏపీవో నాగార్జున ఉన్నారు.

బాలోత్సవంలో గురురాజా విద్యార్థుల ప్రతిభ

● జాతీయ స్థాయిలో 50బహుమతులు కైవసం



బహుమతులు సాధించిన విద్యార్థులు

నంద్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు బాలల పండుగ పోటీలు జాతీయ స్థాయి బాలోత్సవంలో నంద్యాలలోని గురురాజా పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి సోమవారం అన్నారు. గుంటూరు నగరం నంబూరులోని వీవీఐటీలో నిర్వహించిన బాలోత్సవం 2024 జాతీయ స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు 50బహుమతులు కైవసం చేసుకొని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలి చారన్నారు. దేశ వ్యాప్తంగా బాలోత్సవ పోటీలకు 850పాఠశాలలనుంచి దాదాపు 15వేల మంది విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారన్నారు. అత్యధిక బహుమతులు సాధించిన పాఠశాల విద్యార్థులను బాలోత్సవ కన్వీనర్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రశంసించారన్నారు. అద్భుత విజయాలను అందుకున్న విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

ఆత్మకూరురూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడిన వృద్ధురాలిని అటుగా వెళ్తున్న పోలీసులు గమనించి కాపాడారు. ఈ ఘటన మండలంలోని ముష్టపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆత్మకూరు మండలంలోని ముష్టపల్లి గ్రామానికి చెందిన ఖాదరమ్మ అనే వృద్ధురాలు బహిర్భూమికి వెళ్తూ ప్రమాదవశాత్తు బావిలో పడింది. ఓ బాలుడు గమనించి కేకలు వేయడంతో ఓ కేసు నిమిత్తం గ్రామానికి వెళ్తున్న కానిస్టేబుల్ మౌలాలి, హోంగార్డు చక్రపాణి విని బావి వద్దకు వెళ్లి గ్రామస్థుల సహకారంతో తాడును అందించి పోలీసులు వృద్ధురాలిని బయటకు తీసుకవచ్చారు. వృద్ధురాలి ప్రాణాలను కాపాడిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగించుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జిష్ణు నాగవిజయ్ అన్నారు. సోమవారం ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. మేళాకు మొత్తం 55 మంది అభ్యర్థులు రాగా వారిలో 35 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న ఉన్నారు.

నన్నారీ తయారీపై చెంచులకు శిక్షణ

ఆత్మకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ (పీఎం - జన్‌మన్)లోని జీవనోపాదుల మెరుగుపర్చే కార్యక్రమంలో భాగంగా సోమవారం చెంచు గిరిజనులకు నన్నారీ తయారీపై శిక్షణ ఇచ్చారు. ఆత్మకూరులోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణకు నల్లకాల్వ, ఇందిరేశ్వరం, అమలాపురం, కొట్టాలచెరువు గూడేలకు చెందిన గిరిజనులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఐటీడీఏ కమ్యూనిటీ కోఆర్డినేటర్ యూసూఫ్ నన్నారీ తయారీ గురించి వివరించారు.

ఇత్తడి వస్తువుల విరాళం

మహానంది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహానందిలో నూతనంగా ప్రవేశపెట్టిన నది జల హారతులకు కావాల్సిన ఇత్తడితో చేసిన 10 రకాల హారతులతో కూడిన 5 సెట్లను దాతలు విరాళంగా అందచేసినట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఇందులో కర్నూలుకు చెందిన గోవర్ధన్‌రెడ్డి, రోశిరెడ్డి, రమణాచారితో పాటు హైదరాబాద్‌కు చెందిన నరేష్, చైతన్య, సికింద్రాబాద్‌కు చెందిన శ్రీనివాస్ దాతలు జలహారతికి అవసరమైన ఇత్తడి హారతులను అందజేశారని ఈవో చెప్పారు.

'టీడీపీ సభ్యత్వం త్వరగా పూర్తి చేయాలి'

పాణ్యం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వాలు త్వరిత గతిన పూర్తి చేయాలని టీడీపీ మండల కన్వీనర్ గణపం జయరామిరెడ్డి అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయం వద్ద మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రామ్మోహన్ నాయకుడు, ఖాదర్‌బాష, రమణమూర్తి, ఎంపీటీసీ రంగరమేష్, రాంపుల్లారెడ్డి, అమరసింహారెడ్డి, శివశంకరరెడ్డి, సుబ్బారెడ్డి, హనుమంతు, దానం, కేశవ్, దుబాయ్‌శీను, బాలసుబ్బయ్య, విజయ్, రమణ, రవికుమార్, సురేష్, మల్లారెడ్డి, గోవిందరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నంద్యాల, నవంబరు 18 : (ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతిని పురస్కరించుకొని జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని మంగళవారం జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు నిర్వహించాలని డీసీసీ అధ్యక్షుడు బి.లక్ష్మీనరసింహయాదవ్ సోమవారం తెలిపారు. ఉక్కు మహిళ, దేశ మొదటి మహిళా ప్రధానమంత్రి, దేశ సమైక్యత, సమగ్రత కాపాడేందుకు తన చివరి రక్తపుబొట్టు వరకు పోరాడిన మహాయోధురాలు ఇందిరాగాంధీ అని కొనియాడారు. ఆమె 107వ జయంతి సందర్భంగా నంద్యాల పార్లమెంట్‌లోని అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో సమావేశాలు, సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

విజేతలకు అభినందనలు

నంద్యాల కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఏర్పాటుచేసిన ఏపీ శాప్ ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా నంద్యాల చెరువులో కాన్యోయింగ్ కాయాకింగ్ రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మదర్‌థెరిస్సా ఒకేషనల్ జూనియర్ కళాశాల అమ్మాయిలు పడవ పోటీలలో వర్ష, స్పందన, తబిత మొదటిస్థానం సాధించి గోల్డ్‌మెడల్స్ సాధించారు. అలాగే కాయాకింగ్ ఇండివిడ్యువల్ పడవ పోటీ విభాగంలో కూడా వీరు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను డిస్ట్రిక్ ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషనల్ అధికారి సునీత, నవభారత్ హ్యూమన్స్, కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, ఎం సురేష్, అధ్యాపక బృందం అభినందించారు.

నందీశ్వరుడికి జలహారతి

● తిలకించిన భక్తులు

● మహానందిలో కార్తీక మూడో సోమవారం సందడి

మహానంది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహానంది పుణ్య క్షేత్రంలో కార్తీక మూడో సోమవారం పురస్కరించుకొని వేలాదిమంది భక్తులు తరలి వచ్చారు. మహిళలు భక్తి శ్రద్ధలతో ఆలయ పరిసరాల్లోని ధ్వజస్థంభం, నాగులకట్ట వద్ద దీపాలను వెలిగించారు. అనంతరం పరమ శివున్ని దర్శించుకున్నారు. మహానందీశ్వరున్ని, కామేశ్వరీదేవి దర్శించుకున్నారు. సామూహిక అభిషేకాలు నిర్వహించారు. రాత్రి వరకు మహానంది పరిసరాల్లో భక్తుల రద్దీ కనిపించింది. కాగా, మహానందిలో జల హారతి కార్యక్రమాన్ని సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోనేరు ముందు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయాల్లో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు కొమ్మద్ది శంకరయ్య శర్మ, రాజ మాణిక్యశర్మ, రాజ రత్తయ్యబాబు, మామిళ్ళపల్లి రాఘవశర్మ, మణికంఠశర్మలు హర హర శివ శంభో శంకర అంటూ జల హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్ రెడ్డి, ఇంజనీర్ శ్రీనివాసులు యాదవ్, పసుపుల సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: నవనందుల నిలయమైన నంద్యాల పట్టణంలో కార్తీక మూడవ సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని అన్ని శివాలయాలల్లో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ప్రథమ నందీశ్వరాలయంలో భక్తులు శివయ్యను దర్శించుకున్నారు. ఆలయ పరిసరాల్లో మహిళలు దీపాలు, ఆకాశదీపాలను వెలిగించారు. భక్తుల శివనామస్మరణతో ప్రథమనందీశ్వర ఆలయం ప్రాంగణం మారుమోగింది.

గడివేముల: కార్తీకమాస మూడవ సోమవారం పురస్కరించుకొని మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో ఉన్న దుర్గాభోగేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఆలయ ప్రాంగణంలోని పంచకోనేర్లలలో స్నానం ఆచరించి కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం దుర్గాభోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆత్మకూరురూరల్: నల్లమల అభయారణ్యంలో వెలసిన రుద్రకోటేశ్వరాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయంలో వెలసిన రుద్రాణి సహిత రుద్రకోటేశ్వర స్వామి అమ్మవార్లకు ప్రాతఃకాల సమయంలోనే ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు గావించారు. ముందుగా భక్తులు ఆలయప్రాంగణంలోని కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం కమిటీ అధ్యక్షులు రాఘవరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బండిఆత్మకూరు: మండలంలోని శైవ క్షేత్రాలలో శివనామస్మరణ మారుమోగింది. పవిత్ర కార్తీక మాసం మూడవ సోమవారం ఈవో నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఓంకారం, శివనంది క్షేత్రాలలో అర్చకులు స్వామివార్లకు అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించి ప్రార్థించారు. సాయంత్రం ఓంకారంలో గంగా, ఉమాసమేత సిద్దేశ్వర స్వామి వార్ల కళ్యాణం ఈవో ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణ నది క్షేత్రంలో స్వామి వార్లను భక్తులు దర్శించుకున్నారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో, ఆర్యవైశ్య సత్రంలో భక్తులకు అన్నదానం చేశారు.

కొత్తపల్లి: నల్లమల అరణ్యంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న సంగమేశ్వరాలయానికి కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సప్త నదీ తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి, ఎగువన ఉన్న ఉమా మహేశ్వర స్వామి సన్ని ధానంలో భక్తులు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, సహస్ర నామార్చన, పుష్పార్చన తదితరల విశేష పూజాది క్రతువులు చేశారు. అలాగే సాయంత్రం మహిళలు కార్తీక దీపాలు వెలింగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అలాగే కొలను భారతి క్షేత్రంలో కూడా కార్తిక మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు విశేషంగా తరలి వచ్చారు. భక్తులు చారుఘోషిణి నది వద్ద కార్తీక దీపాలు వెలింగించారు. అలాగే సప్త శివాలయాల్లో ప్రత్యేక పూజాది క్రతువులు నిర్వహిం చారు. క్షేత్ర సన్నిధిలో చిన్నారులు అక్షరాభ్యాసం చేయించుకున్నారు.



కోనేరులో గంగాదేవికి పూజలు నిర్వహిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి, వేదపండితులు



దుర్గాభోగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రుద్ర కోటీశ్వరాలయం ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ప్రథమ నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



ఆత్మకూరు: పూజలు చేస్తున్న మహిళలు



సంగమేశ్వరంలో క్షేత్ర ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రజలను చైతన్యవంతం చేయండి

● కలెక్టర్ రాజకుమారి ● భక్త కనకదాసు చిత్రపటానికి నివాళి



భక్తకనకదాసు చిత్రటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కన్నడరచయితగా, సంగీత విద్వాంసునిగా శ్రీభక్త కనకదాసు గుర్తింపు తెచ్చుకొని తన కీర్తనల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్లో భక్త కనకదాసు జయంతి ఉత్సవ సందర్భంగా కనకదాసు చిత్రపటానికి జేసీ విష్ణుచరణ్‌తో కలిసి కలెక్టర్ నివాళి అర్పించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ కనక దాసు ఉత్సవాలు భవిష్యత్తులో వాడవాడలా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ కురువసంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి

నంద్యాల నూనెపల్లె ఓవర్ బ్రిడ్జి కింద వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారిని మాజీ ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా భూమా మాట్లాడుతూ నూనెపల్లె ఓవర్‌బ్రిడ్జి కింద తొలగించిన వ్యాపారులు రోడ్డున పడ్డారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ మార్గంగా నూనెపల్లె మార్కెట్‌యార్డు వద్ద కొత్తగా నిర్మించిన వాటిని కేటాయించాలని కోరారు. అలాగే లలితనగర్‌లో 60 అడుగుల రోడ్డును 40 అడుగులు మార్చుతూ మున్సిపల్ తీర్మానం చేసిన దానిమీద కలెక్టర్‌కు తెలిపారు. నంద్యాల కోవెలకుంట్ల రహదారిలో నిర్మాణంలో భాగంగా కానాల గ్రామంలో ప్రస్తుతం ఉన్న రహదారి కాకుండా పేదరైతుల భూములలో వెళ్లడం అన్యాయమని, ప్రస్తుత రహదారి ద్వారా వెళితే రైతులకు న్యాయం జరుగుతుందని కలెక్టర్‌కు వివరించారు.

వివాదాన్ని పరిష్కరించాలి

చాగలమర్రి మండలం రాంపల్లె గ్రామంలో రామాలయ నిర్మాణ విషయంలో చోటు చేసుకున్న వివాదాన్ని పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. సోమవారం గ్రామస్థులు కలెక్టర్ కలిసి వినతి పత్రం అందించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

● పట్టణంలోని సచివాలయం ముందు సీపీఐ నాయకుల ధర్నా



సచివాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇచ్చి, గృహాలు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల మంజూరు చేయాలని సీపీఐ నాయకుడు రఘురాంమూర్తి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం పేద ప్రజలకు ఇంటి స్థలాన్ని ఇచ్చి, పక్కా గృహాలను నిర్మించాలంటూ పట్టణంలోని 7వ సచివాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి రజితమ్మ, నాయకురాళ్లు స్వర్ణలత, జయమ్మ, ఏఐటీయూసీ నాయకులు రవికుమార్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యేసన్న, తిరుపాలు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు డిమాండు చేశారు. సోమవారం జూపాడుబంగ్లా సచివాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్లు సత్యదీప్, నాగన్నలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, ఏసన్న, నాగన్న, పుల్లయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల : పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ప్రాతకోట గ్రామంలోని సచివాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కలాం, ఖాజా ఉసేన్, యూస్‌ఫ్‌బాషా, , వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడులో కార్తీక వనభోజనాలు



భోజనాన్ని వడ్డిస్తున్న నిర్వాహకులు

పాములపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడవ సోమవారం పురస్కరించుకొని వనభోజనాల కార్యక్రమం శ్రీరామ భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. పాములపాడు బ్రహ్మంగారి ఆశ్రమంలోని శివాలయం ఆవరణలో తులసి, ఉసిరిక వృక్షాల కింద పురోహితులు కోదండరామశర్మ మహిళలచే సాముహిక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ మండల నాయకులు ఆళగడ్డ హరిసర్వోత్తమరావు హాజరయ్యారు. గ్రామ ప్రజల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు

శాస్త్రోక్తంగా కార్తీక వనమహోత్సవం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని వేంకటేశ్వరుడి ఆలయంలో సోమవారం కార్తీక మాసోత్సవ క్రతువును శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా ఆలయంలోని స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో వున్న ఉసిరి, తులసిచెట్లకు ప్రత్యేక అలంకరణ గావించి ధాత్రిపూజలు జరిపారు. విచ్చేసిన మహిళలు విష్ణుస హస్ర నామార్చన పఠించారు. కార్యక్రమంలో అర్చకులు అనిల్‌కుమార్, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీజేఎఫ్ఏ డివిజన్ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్

ఆత్మకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ ఆత్మకూరు డివిజన్ అధ్యక్షుడిగా వెలుగోడు రేంజ్‌లో పంగిడి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ముక్కిళ్లపాటి అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. సోమవారం ఏపీ జూనియర్ ఫారెస్ట్ అసోసి యేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా అనిల్‌కుమార్‌తో పాటు ఉపాధ్యక్షులుగా సయ్యద్ సాహేబ్ పీరా, కార్యదర్శిగా తాహీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కావేరీ, జాయింట్ సెక్రటరీగా కుమార్, ట్రెజరర్‌గా ఎస్.కే అబిద నియమితులయ్యారు. నూతన అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడుతానని వెల్లడించారు.

రీసర్వే ఫిర్యాదులు పరిష్కరించండి

పాణ్యం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే ఫిర్యాదులను పరిష్కరించాలని జేసీ విష్ణు చరణ్ సూచించారు. ఇటీవల రీసర్వేలపై నిర్వహిం చిన గ్రామసభల్లో రైతుల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దారులకు అవగాహన కల్పించారు. గ్రామ సభల్లో అందిన జాయింట్ ఎల్‌పీఎంలు, విస్తీర్ణ, మ్యూటేషన్, క్లాసిఫికేషన్, పేర్లమార్పు, తదితర సమస్యల ఫిర్యాదులను ఎలా పరిష్కరిచుకోవాలో జేసీ విష్ణు చరణ్, సర్వే శాఖ ఏడీ జయరాజులు తహసీల్దారు, మండల సర్వేయర్లు, వీఆర్వోలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాము, మండల సర్వేయరు నాగరాజు, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తపల్లి : మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహించిన భూ రీసర్వే గ్రామ సభల అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయా గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ పెద్దన్న తదిరతులు పాల్గొన్నారు.

బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ చేయూత

ఆత్మకూరురూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరివేన గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల అధ్యక్షుడు దస్తగిరి ఆధ్వర్యంలో చేయూతనందించారు. బాధిత కుటుంబానికి కావలసిన వంట సామాను, దుప్పట్లు నిత్యావసర వస్తువులు, ఇతర చిన్న సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు శ్రీనివాసులు సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సొసైటి ఆత్మకూరు అధ్యక్షులు చింతలయ్య, సభ్యులు హినాయతుల్లా, రాము, వెంకటేశ్వర్లు ,ఖయ్యూం, మక్బుల్‌భాష, ప్రసాద్, రాము తదితరులున్నారు.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

శ్రీశైలం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా దేవస్థానం సోమవారం సాయంత్రం నెల్లూరుకు చెందిన నందీశ్వర కూచిపూడి కళాక్షేత్రం బృందంచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో మహాగణపతిం, మూషికవాహన, వినాయకకౌత్వం, శివాష్టకం తదితర గీతాలకు శరణ్యరెడ్డి, పర్ణికరెడ్డి, నిఖిల, వినీలరెడ్డి తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు. విజయవాడకు చెందిన కళారాధన మూజిక్ అండ్ డాన్సు అకాడమీ బృందంచె శివశంభో, నటేశ కౌత్వం, విఘ్నరాజం భజే, శివతాండవం తదితర గీతాలకు కార్తీక, సంధ్య, శ్రావ్య, తీర్థ, పవిత్ర, తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

వీఆర్వోల సంఘం మండల కమిటీ ఎన్నిక

మిడుతూరు, నవంబరు 18: (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల మండల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు వీఆర్వోలు తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడిగా సంజీవరాజు, ఉపాధ్యక్షుడిగా ఖాజాహుశేన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య, ఉపప్రధాన కార్యదర్శిగా రామయ్య, కోశాధికారిగా ఖాద ర్ బాష, సంఘం మెంబర్లుగా బాలన్న, సోఫిసాహెబ్, ప్రసాద్‌రావు, సుందర రాజు, శ్రీనివాసులు, రామకృష్ణ, రహీమ్ , గౌరవ అధ్యక్షుడిగా పుల్లారెడ్డిని ఎంపిక చేసినట్లు వీఆర్‌వోలు తెలిపారు.

19 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

జూపాడుబంగ్లా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 19 నుంచి 22 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. ఈనెల 19న పోతులపాడు, 20న తంగడంచ, 21న మండ్లెం, 22న తర్తూరు గ్రామాల్లోని సచివాలయాల వద్ద శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కొత్తగా నమోదు, అప్‌డేట్, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

పాములపాడు: మండలంలో నాలుగు రోజుల పాటు ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తు న్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 19న రుద్రవరం, 20న పాములపాడు, 21న ఎర్రగూడూరు, 22న మిట్టకందాల గ్రామాలలోని సచివాలయాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నా మని తెలిపారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కూరగాయలతో శివలింగాలు



కూరగాయలపై శివలింగాలు

నందికొట్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిత్రకారుడు డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులు కూరగాయలపై శివలింగాలు తయారు చేసి పూజలు చేశారు. సోమవారం కార్తీక సోమవారం సందర్భంగా చిలగడ దుంప, క్యారెట్, బంగాళదుంప, బీట్రూట్‌లతో ఆయన శివలింగాలను విభిన్నంగా తయారు చేశారు. చూపరులను ఈ శివలింగాలు ఆకట్టుకున్నాయి.

సచివాలయాల తనిఖీ



ఎర్రగూడూరు సచివాలయం తనిఖీ చేస్తున్న డీఎల్‌డీవో

పాములపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగూడూరు, పాములపాడు సచివాలయాలను డీఎల్‌డీవో సూర్యనారాయణ ఆకస్మిక తనిఖీ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్‌తో కలిసి సచివాలయాలలో రికార్డులను పరిశీలించారు గ్రామాలలో నిర్వహిస్తున్న ఎంపీపీ, హౌసింగ్ మ్యాపు సర్వేలు పని తీరును అడిగి తెలుసుకున్నారు. మ్యాపింగు సర్వేలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

ఔషధ మొక్కల ప్రాధాన్యం వివరించాలి

పాణ్యం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కల ప్రాధాన్యం ప్రజలకు వివరించాలని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా సోమవారం శాంతిరాం ఫార్మసీ కళాశాలలో విద్యార్థులు విలువైన ఔషధ మొక్కలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మొక్కల విలువలతో పాటు ప్రయోజనాలు, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి మనకిచ్చిన విలువైన సంపద ఔషధ మొక్కలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భవన కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయు పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, అధ్యక్షులు నాగేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉంచిన పథకాల పరిహారాలను వెంటనే ఇవ్వాలని అన్నారు. స్థానికంగానే పనులు కల్పించి వలసలను నివారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సురేంద్ర, రవూఫ్, అబ్దుల్లా, చిన్నవలి, నిసార్, ఓబులేసు, నూర్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని అరికడదాం: బీసీ ఇందిరమ్మ



కార్తీక వనభోజనంలో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్ భూతాన్ని అరికట్టడానికి ప్రతి విద్యార్థి సహకరించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. సోమవారం కేజీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కంకర రామచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు బీసీ ఇందిరమ్మకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టంగుటూరు శ్రీనయ్య, టీచర్ నాగరాజు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

చింతమాను మఠంలో కార్తీక వనభోజనం: బనగానపల్లె పట్టణంలోని చింతమాను మఠంలో సోమవారం నిర్వహించిన కార్తీకవనభోజన కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ కార్తీక మాసంలో ఇలాంటి వనభోజనాలు ఏర్పాటు చేసుకోవడం హిందువులకు ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో చిరంజీవి ఆచారి, గోపాల్‌రెడ్డి, జయరామిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మంత్రి బీసీకి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ వినతి



మంత్రి బీసీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బీవీ

బనగానపల్లె, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కోరారు. సోమవారం అమరావతిలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి బీవీ వినతిపత్రం అందజేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని రోడ్లు, ఇతర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. సమస్యలు పరిష్కరించడానికి తనవంతు సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఘనంగా పంచారామ పల్లకి శోభాయాత్ర



చాగలమర్రిలో పంచారామ పల్లకితో ఊరేగింపు

చాగలమర్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో పంచారామా శోభాయాత్ర పల్లకి ఉత్సవం సోమవారం రాత్రి సాయి భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. కాకినాడ, పిఠాపురం నుంచి పంచారామా పల్లకియాత్ర చాగలమర్రికి చేరుకుంది. ఐదు పంచారామ క్షేత్రాలనుంచి శోభాయాత్ర నిర్వహించామని ప్రతినిధి రామ్‌రాజ్ తెలిపారు. డిసెంబరు 13 వరకు ఆయా గ్రామాల్లో శోభాయాత్ర కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సాయి భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డు పోస్టుమాస్టర్ మృతికి నివాళి



రిటైర్డు పోస్టుమాస్టర్ గోపాల్‌రెడ్డికి నివాళి అర్పిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని కరీంబాగ్ కాలనీ రిటైర్డు పోస్టుమాస్టర్ పెద్దగోపాల్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం ఆయన భౌతిక కాయంపై మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలి

బనగానపల్లె, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వాలు పునరాలోచించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు కోరారు. సోమవారం మాట్లాడుతూ వర్గీకరణ వల్ల మాల మాదిగల మధ్య విబేధాలు ఏర్పడతాయన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఇలా విభజిస్తున్నారన్నారు. ఎస్సీలకు రిజర్వేషన్లు పెంచి వర్గీకరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, శిఖామణి, వెంకటేశ్వర్లు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్లు సీజ్

బనగానపల్లె, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లు సీజ్ చేసినట్లు బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి సోమవారం తెలిపారు. అక్రమంగా గ్రావెల్ త్రవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా టిప్పర్లును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అయితే గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో రెండు టిప్పర్లును సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి



గెలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొర్నిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని భాగ్యనగరం జడ్పీహెచ్ ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మమ్మ అన్నారు. సోమవారం భాగ్యనగరం పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీధర్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబులేసు, నాగరాజు, గంగాధర్, సురేష్, వహిద, లక్ష్మీఈశ్వరమ్మ, మధు తదితరులు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు



కాశింతల క్షేత్రంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

బనగానపల్లె, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు యాగంటికి తరలిరావడంతో తెల్లవారుఝామున నుంచే క్యూలైన్లు నిండిపోయాయి. యాగంటి బసవేశ్వరున్ని, ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులు అభిషేకాలు, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు చిన్న కోనేరు, శ్రీవీరబ్రహ్మేంద్రగవి, శంకర గవి, శ్రీ వెంకటేశ్వరస్వామి గవిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లను ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ప్యాపిలి: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నీలకంఠేశ్వరస్వామి, ఈశ్వరస్వామి, భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు.

కొలిమిగుండ్ల: కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకొని మండలంలోని ప్రముఖ శైవక్షేత్రాలన్నీ శివనామ స్మరణలో మారుమోగాయి. ఈసందర్భంగా కొలిమిగుండ్ల శివాలయం, బెలుం సిద్ధరామేశ్వరాలయం, పేట్నికోట విశ్వేశ్వరస్వామి ఆలయం, నేలబిళం మల్లేశ్వరస్వామి ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించడంతో ఆలయాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. బెలుం సిద్ధ రామేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు మహేష్‌శర్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో కార్తీక మాస మూడో సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఉయ్యాలవాడ శివాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. రూపనగుడిలో మహిళలు తెల్లవారుజామున కుందూనదిలో దీపాలు వెలిగించి వదిలారు. ఆర్.జంబులదిన్నె గ్రామంలో ఆంజనేయస్వామికి, ఇంజేడు గ్రామంలో వెంకటేశ్వరస్వామికి అర్చకుడు కీర్తి లక్ష్మణస్వామి అభిషేకం అలంకరణ చేసి దీప దూప నైవేద్యాలు సమర్పించారు. మార్కెమ్మ గుడి వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలు, ఆలయాలు సోమవారం శివనామ స్మరణతో మారుమోగాయి. మహిళలు ఆలయాలకు వెళ్లి కార్తీక దీపాలు వెలిగించారు. ఆళ్లగడ్డ మండలంలోని కాశింతల క్షేత్రంలో టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అహోబిలం లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం నిర్వాహకుల ఆధ్వర్యంలో లక్ష్మీవనంలో నిర్వహించిన కార్తీక వనభోజన మహోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. శ్రీదేవీ, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వామికి ఆయన విశేష పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

రుద్రవరం: మండలంలోని శివాలయాల్లో సోమవారం మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. రుద్రవరం భాస్కర నందీశ్వరాలయం, వాసాపురం, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, ఆలమూరు ఇంకా పలు గ్రామాల్లో మహిళలు దీపాలు వెలిగించి కార్తీక మాస పూజలు శివకేశవులకు చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని ఆమలింగేశ్వర, భీమలింగేశ్వర, బుగ్గమల్లేశ్వర, భైరవిశ్వర ఆలయాల్లో సోమవారం కార్తీకదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఓంకారనాదలతో ఆలయాలు మారుమోగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. శివ పార్వతుల పల్లకి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



యాగంటి ఆలయం ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ప్యాపిలిలో..



కొలిమిగుండ్లలో..



అహోబిలంలో పూజలు నిర్వహిస్తున్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి



ఉయ్యాలవాడ శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



చాగలమర్రి భీమలింగేశ్వర ఆలయంలో...

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

డోన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని చిగురుమానుపేట, శ్రీరాంనగర్, వైఎస్ఆర్ నగర్, సుందర్‌సింగ్ కాలనీ సచివాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హించారు. కార్యక్రమంలో నాయకులు సుంకయ్య, నారాయణ, వరదరాజులు, మోటా రాముడు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలివ్వాలని సీపీఐ నాయకులు భార్గవ్ కోరారు. సోమవారం గ్రామ సచివాలయాల్లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలాలివ్వాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. అంబాపురం, రంగాపురం, గోర్లగుట్ట గ్రామాలలోని అర్హులైన పేదలతో అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలేశ్, ఉదయ్, ఎల్లాక్రిష్ణ, భాస్కర్, విధాత, సోమన్న, నాగేశ్వరరావు, శ్రీరాములు, నాగేష్, ఇద్రుస్‌బాషా పాల్గొన్నారు.

ప్యాపిలి: పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే రాధాక్రిష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ప్యాపిలి, కలచట్ల, గుడిపాడు గ్రామ సచివాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వ హించారు. అనంతరం నాయకులు ప్యాపిలి పంచాయితీ కార్యదర్శి శివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, క్రిష్ణ, చెన్నకేశవులు, ఎర్రితాత, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పేదలకు ఇంటిపట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు పట్టణంలోని సచివాలయం1, 3, 4 వద్ద సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి, జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి శివయ్య, శివనాగయ్య, కులాయప్ప, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: ప్రభుత్వం అర్హులందరికీ వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ అనుబంధ సంస్థ ఏఐటీయూసీ జిల్లా నాయకులు శివబాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రమైన కొలిమిగుండ్లలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు ఇంటి స్థలాల కోసం గ్రామ సచివాలయంలో సిబ్బంది కౌసల్యకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు సూర్యనారాయణ, బాలసంజీవులు, మహేష్, చంటి, నాగేష్, రంగా, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అవుకు: కూటమి ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఏఐటీయూసీ అవుకు మండల కార్యదర్శి నాగాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అవుకు సచివాలయం - 1 వద్దకు ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలతో కలసి వచ్చి అధికారులకు అర్జీ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రుద్రవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయా లని సీపీఐ ఆళ్లగడ్డ కార్యదర్శి భాస్కర్, రుద్రవరం మండల కార్యదర్శి బాలనరసింహలు డిమాండ్ చేశారు. సోమవారం రుద్రవరంలో సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందించారు.



డోన్‌లో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రామాంజినేయులు



ప్యాపిలిలో పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి: ఎంపీడీవో



సర్వే తనిఖీ చేస్తున్న ఎంపీడీవో ప్రసాదరెడ్డి

కొలిమిగుండ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి జియో ట్యాగింగ్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి సర్వే కార్యక్రమంపై ఎంపీడీవో సమీక్షించారు. సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

మొబైల్ ఆధార్ క్యాంపులను వినియోగించుకోండి

ఉయ్యాలవాడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆయా సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ మొబైల్ క్యాంపులను వినియోగించుకోవాలని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 22 వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. 19, 20వ తేదీల్లో బోడెమ్మనూరు, హరివరం సచివాలయాల్లో, 21, 22వ తేదీల్లో ఉయ్యాలవాడ, మాయలూరు సచివాలయాల్లో నిర్వహిస్తామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు క్యాంపులు ఉంటాయన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

చాగలమర్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో దళితులకు చెందిన భూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవికుమార్‌ను కలిసి దళితుల సమస్యల గురించి చర్చించారు. గొట్లూరు గ్రామంలో కుంట దగ్గర ఉన్న రేకుల షెడ్డును తొలగించాలని తహసీల్దార్‌ను కోరారు. 444 సర్వే నంబర్‌లోగల రేకుల షెడ్డును తొలగించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు నాగేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



పరుగు పందెం నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి

అవుకు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు రకాలు పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి రామదాసు తెలిపారు. ఈ సందర్భంగా అవుకు జడ్పీ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, పరుగు పందెం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

దొర్నిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆధార్ నమోదు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సులోచన అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 19, 20న ఉపాపతినగర్, దొర్నిపాడు-1, 21, 22న దొర్నిపాడు-2, డబ్ల్యూగోవిందిన్నె, 26, 27న డబ్ల్యూ.కొత్తపల్లె, బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల, 28, 29 తేదీల్లో క్రిష్టిపాడు, చాకరాజువేముల గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో ఆధార్‌కార్డులో పేర్లు తప్పొప్పులు ఉంటే సరి చేయించుకోవాలని సూచించారు.

రుద్రవరం: మండలంలోని రెండు గ్రామాల్లో ఆధార్ కార్డు అప్‌డేట్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి సోమవారం తెలిపారు. 19, 20 పెద్దకంబలూరు, 21, 22 తేదీల్లో నరసాపురం సచివాలయాలలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

సీపీఎం కార్యదర్శిగా నక్కి శ్రీకాంత్



డోన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సీపీఎం కార్యదర్శిగా నక్కి శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నాగరాజు సమక్షంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సీపీఎం ముందుండి పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, కొండయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విష్ణు సహస్ర నామ పారాయణం

చాగలమర్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో కార్తీకమాసం సందర్భంగా సోమవారం మహిళలు సామూహికంగా విష్ణు సహస్ర పారాయణం నిర్వహించారు. మండల సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శివపార్వతులకు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం



మాట్లాడుతున్న సల్లా నాగరాజు

చాగలమర్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీడీపీ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి మృతి పార్టీకి తీరని లోటని, ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా బడ్జెట్ ప్రవేశపెట్టారని తెలిపారు. టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, రామతీర్థం, పీరయ్య, మహబూబ్‌బాష, టీడీపీ నాయకులు నరసింహులు, భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు, ఓబులేసు, చోటు, అమీర్, రామసుబ్బయ్య, బాలదస్తగిరి, బషీర్ పాల్గొన్నారు.

పంటలకు బీమా చేయించుకోవాలి

రుద్రవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రబీ సీజనులో రైతులు సాగు చేసే పంటలకు ప్రీమియం డబ్బులు చెల్లించి బీమా చేసుకోవాలని వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాద్ సోమవారం రైతులను కోరారు. ఆయన మాట్లాడుతూ పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా పథకం మార్గదర్శకాలకు సంబంధించి వివరాలు తెలిపారు. గ్రామ యూనిట్ కింద శనగ పంటకు ఎకరాకు రూ.84, మండల యూనిట్ కింద జొన్న పంటకు ఎకరాకు రూ.59, మినుము రూ.45, వరి రూ.126, జిల్లా యూనిట్‌కు గాను వేరుశెనగ 64, ఉల్లి 90 ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. డిసెంబరు 15 చివరి తేది అన్నారు. పంటలకు మాత్రం డిసెంబరు 30 లోగా కట్టాలన్నారు. దీని కోసం క్రాప్ట్ సోన్ సర్టిఫికెట్ 1బీ, బ్యాంకు పాస్‌బుక్కు, ఆధార్‌కార్డుతో కామన్ సర్వీసెసెంటరు సంప్రదించి ప్రీమియం చెల్లించాలని ఆయన కోరారు.

గ్రంథాలయాలతో అపార జ్ఞానం

బనగానపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలతో అపార జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లలిత అన్నారు. సోమ వారం బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ ప్రదర్శన నిర్వహించి గ్రంథాలయాల వల్ల ఉపయోగాలని ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాబూనాథ్, అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి బడే సాహెబ్ వసుంధర, సుధాకర్‌రెడ్డి, మహమ్మద్‌గౌస్, రామకృష్ణ, కౌసల్యాదేవి, రవికుమార్, నాగరాజారెడ్డి, వరలక్ష్మి, రామన్న, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ప్యాపిలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రోడ్డు దాటే తప్పడు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మధుసూదన్ అన్నారు. సోమవారం మండలంలోని ఏనుగమర్రి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు దాటే సమయంలో వాహనాల రాకపోకలను గమనించాలన్నారు. బైకులు నడిపే వారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.